హైదరాబాద్ వార్త





# భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

## -ఉత్తర ద్వార దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



శ్రీవారి దేవాలయంలో పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



దేవాలయంలో పాల్గన్న భక్తులు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా బషీర్ బాగ్ టీటీడీ బాలాజీ టెంపుల్ దర్శనానికి భక్తులు దోమలగూడ వరకు లైన్ లో వేచిఉన్న భక్తులు

**సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని హిమాయత్ నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్ లో నిలబడ్డారు. క్యూలైన్ దోమలగూడలో ప్రవేశం రోడ్డు వరకు కొనసాగింది. సోమవారం తెల్లవారు ఝామున 1.30 గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా శ్రీవారిని రాత్రి వరకు భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణలతో దేవాలయం, పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. పసి పిల్లల దగ్గర నుంచి వృద్దుల వరకు భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయాన్ని సిబ్బంది రకరాల పూలతో, విద్యుత్ దీపాలతో ఆధ్యాత్మికత ఉంటిపడేలా అందంగా అలంకరించారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా వందలాది మంది పోలీసులు, దేవాలయం సిబ్బంది, శ్రీవారి సేవకులు, వాలంటీర్లు ఎంతో కృషి చేశారు. ముందు జాగ్రత్త చర్యగా సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. ధనుర్మాసం సందర్బంగా శ్రీవారి పూజా కార్యక్రమాలు యధావిధిగా కొనసాగాయి. శ్రీవారికి ఏకాంత సేవ, తిరుప్పవై సేవతోపాటు తోమాల సేవ, సహస్రఅర్చన, మధ్య మధ్యలో శ్రీవారికి ఏకాంత సేవలు, నైవేద్యం కొనసాగాయి. శ్రీవారు, పద్మావతి, గోదాదేవి అమ్మవారును అర్చకులు అందంగా అలంకరించారు. భక్తుల కు తీర్థప్రసాదాల వితరణ గావించారు.

శ్రీవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, దేవాలయం లోకల్ అడ్వైయిజరీ కమిటి ఛైర్మన్ నేమూరి శంకర్‌గౌడ్, హిమాయతనగర్ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ తదితరులు పాల్గొనగా టిటిడి డి-ఎఈవో యు.రమేష్, అధి కారులు మణికంఠ, లక్ష్మీపతి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది భక్తులకు సేవా కార్యక్రమా ల్లో పూర్తిగా నిమగ్నమైనారు.

# హద్దు మీరితే ..అంతే సంగతి!

**-న్యూఇయర్ వేడుకలపై డేగ కన్ను**
**-హంగామా సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**
**-ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీస్,ఎక్సైజ్‌శాఖలు**
**-పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, ఫ్లైఓవర్‌ల మూసివేత**





**హైదరాబాద్,డిసెంబరు 30,ప్రభాతవార్త:** పాతసంత్సరానికి వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే న్యూఇయర్ వేడుకలపై పోలీసులు నజర్ వేశారు. వేడుకల సందర్బంగా రెచ్చిపోయే యువతకు బ్రేకులు వేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.నగరంలోని మూడు కమీషనరేటర్‌ల పరిధిలో వేడుకలు జోష్‌గా జరిగే అవకాశం ఉండటంతో ఉన్నతాధికారులు అన్నిపోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. వేడుకల్లో శృతిమించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎలా పాటించాలనే దానిపై సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సివిల్, పోలీసులతోటు, ఎక్సైజ్,ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు అలాగే ఇతర విభాగాలకు చెందిన పోలీస్ బలగాలను రంగంలోకి దింపారు. పోలీస్‌స్టేషన్లవారిగా ఏఏప్రాంతాల్లో వేడుకలు జరగుతున్నాయి. వాటికి ఎంతమంది హాజరయ్యే అవకాశం ఉంది. అక్కడ నిర్వహించే కార్యక్రమాల వివరాలను పూర్తిగా సేకరించారు. వేడుకల సందర్భంగా నిషేదిత మాదక ద్రవ్యాలు వాడే అవకాశం ఉండటంతో ఈఅంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిషేదిత మాదకద్రవ్యాలు సప్లై చేయడం,వాటిని వాడటం వంటివి గుర్తిస్తే కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయనున్నారు. మత్తెక్కించే మద్యం, శరీరం మొత్తం షేక్ చేసి మ్యూజిక్ ల నడుమ యువత వేడుకల్లో శృతిమించితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు. న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవంటున్నారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..**

కొత్తేడాదికి హైదరాబాద్ ,సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలల్లో కలిపి దాదాపు 500లకుపైగా ఈవెంట్లకు అనుమతినిచ్చారు. ఈసందర్బంగా ఈవెంట్ నిర్వాహాకులకు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. నిబంధనల ప్రకారం రాత్రి 8గంటలనుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజే సౌండ్స్‌తో ఇతరులకు ఇబ్బందులు కలిగించే పనులు చేయరాదు. శబ్దం 45డెబిల్స్ దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేడుకల్లో భాగంగా బాణాసంచా కాల్చడం నిషేదం. వేడుకలు ప్రారంభం నుండి పూర్తి అయ్యే వరకు వీడియేలు చిత్రీకరించి వాటిని 1,2తేదీల్లోపు కమీషనరేట్స్‌లో అప్పగించాలి. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నా నిర్వాహకులే బాద్యులు అవుతారని దీనిని దృష్టితో ఉంచుకుని వేడుకలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని అన్ని రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నారు. చిత్తుగా తాగి డ్రైవింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేసి వాహనాలు స్వాధీనం చేసుకుంటామని పోలీసులు తెలుపుతున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు.. ఫ్లైఓవర్‌ల మూసివేత ..**

-న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ సిటి పోలీస్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనుచోటు చేసుకోకుండా నగరమంతా డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించనున్నటు తెలిపారు. ట్యాంక్‌బండ్,నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్‌మార్గ్‌లతోపాటునగరంలోని అన్ని ఫ్లైఓవర్‌లను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈఆంక్షలు బుధవారం రాత్రి 10గంటల నుండి గురువారం ఉదయం 8గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

# దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా చెక్

## -5 ఎకరాల మేర కబ్జాల తొలగింపు



కబ్జాకు గురైన ప్రాంతం

**హైదరాబాద్, డిసెంబర్ 30,ప్రభాతవార్త:** చుట్టూ ఎత్తైన కొండల మధ్య సీక్రేట్ లేక్ గా పేరు గాంచిన దుర్గంచెరువును కబ్జాల చెర నుంచి హైడ్రా విడిపిస్తోంది. మాధాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది. మట్టితో నింపి వాహనాల పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ. 50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు హైడ్రా చెక్ పెట్టింది. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేసింది. తర్వాత మట్టిని తొలగించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. అక్కడ బాహాటంగా జరిగిన కబ్జాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో విచారణ చేయమని ఆదేశించారు. ఈమేరకు పరిశీలించిన హైడ్రా అధికారులు.. కబ్జాలను నిర్ధారించుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. నగరం నడిబొడ్డున.. ఐటీ కారిడార్‌లో అందమైన సరస్సుగా అలరించిన దుర్గం చెరువు మురుగునీటితో దుర్గంధంగా మారింది. ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న చెరువు నేడు 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ తప్పితే.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. 1976 నాటికే 29 ఎకరాల వరకూ కబ్జా అయి.. 131.66 ఎకరాలకు మిగిలిపోయింది. 1976 వ సంవత్సరం నుంచి 1995 వరకూ భద్రంగానే ఉంది. 1995 నుంచి 2000 సంవత్సరం వరకూ మరో 10 ఎకరాల మేర కబ్జాకు గురై.. 121 ఎకరాలకు కుంచించుకుపోయింది. 2000 నుంచి నేటికి మరో 5 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా ఎప్పుడు ఏ సంవత్సరంలో కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్ ఆర్ఎస్ సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.

**మట్టితో నింపుతూ ఆక్రమణలు..**

మాధాపూర్ ఇన్ ఆర్బిట్ మాల్ వైపు ఏకంగా 5 ఎకరాలు కబ్జాలకు గురైంది. కొండలను తవ్వుతూ భవంతులు నిర్మించిన వారికి దుర్గం చెరువు డంపింగ్ యార్డుగా మారింది. 10 నుంచి 15 మీటర్ల మేర మట్టితో నింపి క్రమంగా చెరువులోకి జరిగి ఏకంగా 5 ఎకరాలను కబ్జా చేశారు. అలా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమించిన స్థలం నాదంటూ ఓ ప్రజాప్రతినిధి ఇప్పుడు క్లైం చేస్తున్నారు. అంతే కాదు.. స్కూల్ బస్సులు, ఐటీ సంస్థలకు చెందిన వాహనాల పార్కింగ్‌తో ప్రతి నెల రూ. 50 లక్షల వరకూ అద్దెలు అనుభవిస్తున్నారు. భూమికి సంబంధించిన రికార్డులు లేకుండానే అక్కడ పార్కింగ్ దందా చేస్తున్నారు. నెమ్మదిగా మట్టిని నింపుకుంటూ ఎకరం నుంచి 5 ఎకరాల వరకూ ఆ ప్రజా ప్రతినిధి ఆక్రమించేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈఆక్రమణ అడ్డుగా మారింది. ఆయనదని చెబుతున్న భూమే ప్రతి ఏటా పెరుగుతుండడం గమనార్హం. హెచ్ఎండీఏ మాత్రం 2014లో 160.7 ఎకరాలుగా నిర్ధారిస్తూ ప్రిలిమనరీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్ ఆర్ ఎస్ సీ, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు వైశల్యాన్ని తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఈలోపు చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తోంది

# కందికల్ ఆర్వోబిపై కాలిబటలో అగ్నిప్రమాదం

## - మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది

## - ట్రాఫిక్‌ను నియంత్రించిన పోలీసులు



కందికల్ ఆర్వోబిపై జరిగిన అగ్నిప్రమాదాన్ని ఫైర్ ఇంజన్‌తో ఆర్పుతున్న పోలీసులు

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** పాతబస్తీ కందికల్ ఆర్వోబి (ఫైవంతెన)పై గల కాలిబటలో పేరుకుపోయిన చెత్తకు మంగళవారం సాయంత్రం ఉన్నఫళంగా మంటలంటుకొని పొగలు వ్యాపించాయి. బోయిగూడ నుండి నర్కిపూల్‌బాగ్ వెళ్ళే మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఛత్రినాక పోలీసులు వెంటనే స్పందించి సమీపంలోని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నంలో దట్టమైన పొగలు వచ్చాయి. ఆమార్గంలో వెళ్ళే వాహనదారులకు దారి కనిపించక ఇబ్బంది పడ్డారు. పోలీసులు వాహనాలను నెమ్మదిగా ముందుకు వెళ్ళనిచ్చారు. కందికల్ రైల్వే క్రాసింగ్‌పై నిర్మించిన వంతెన కారణంగా దిగువ ఉన్న రోడ్డును రైలు పట్టాలకు ఇరువైపుల మూసి వేశారు. స్థానిక ప్రజలు చిత్రగుప్త దేవాలయం నుండి కందికల్ రెడ్డిబస్తీ వైపు, ఆటు నుండి ఇటు వైపు వంతెన కింద ఉన్న రైలు పట్టాలను దాటేందుకు మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ మెట్ల మార్గం నుండి వంతెన పైకి చేరుకొని అటు వారు ఇటూ, ఇటు వారు అటూ వెళ్ళాలి. స్థానికులు ఎక్కువగా కందికల్ రెడ్డిబస్తీ వైపు నుండి చిత్రగుప్త దేవాలయ మెట్ల మార్గాన్ని, కాలిబాటను ఎక్కువగా వినియోగిసున్నారు. మరోవైపు గల కాలిబటను ఎవరూ వినియోగించటం లేదు. ఆమార్గంలో చెత్తాచెదారం పేరుకుపోయి చెత్తకుండీగా మారింది. ఆకతాయిలు, సిగరేట్ కాల్చేవారు తాగి పడేసిన చుట్టతో చెత్తకు నిప్పంటుకొని అగ్నిప్రమాదం సంభవించింది. కాగా ఈ మార్గంలోని కాలిబటలపై పారిశుధ్య నిర్వాహణను బల్దియా పట్టించుకోక పోవటం లేదు. ఫలితంగా గత కొన్ని రోజులుగా కాలిబట చెత్త కుప్పగా మారింది. అగ్నిప్రమాదానికి కారణమైయ్యింది. అంతేకాకుండా రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారుతుంది.

# త్వరలో అందుబాటులోకి నల్గొండ చౌరస్తా - ఓవైసీ జంక్షన్ కారిడార్

## -జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్



ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**సైదాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** నల్గొండ చౌరస్తా - ఓవైసీ జంక్షన్ కారిడర్ పనులను జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్ పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గింపే లక్ష్యంగా రూ.620 కోట్లతో చేపడుతున్న ఈ కారిడర్‌లో 2530 మీటర్ల పొడవైన మెయిన్ ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తున్నారు. 80శాతం పనులు పూర్తి కావడం జరిగిందని అధికారులు కమీషనర్‌కు వివరించారు. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసి ఏప్రిల్ నాటికి ఫ్లైఓవర్‌ను ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్స్‌కు కమీషనర్ సూచించారు. కారిడర్‌లో క్రిటికల్ స్ట్రెచ్‌గా ఉన్న సైదాబాద్, దోభిఘాట్ జంక్షన్ పనులు నిరంతరాయంగా చేపట్టేలా ట్రాఫిక్ మళ్లింపుకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని, సర్వీస్ రోడ్లకు అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇఇ బి.గోపాల్ పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు



చార్మినార్ వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పల్లకి ఊరేగింపు

**చార్మినార్,డిసెంబరు 30 ప్రభాతవార్త :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం పాతబస్తీలో చార్మినార్‌సమీపంలో ఉన్న చౌక్ మైదాన్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పల్లకి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.మంగళవారం ఉదయం ఆరున్నర గంటలకు మందిరం నుంచి ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పల్లకి ఊరేగింపు చార్మినార్, గుల్జారాహౌస్‌తో పాటు పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంది.ఈ సందర్బంగా మందిరం ప్రధాన అర్చకులు శృంగారం ఆత్రేయ చార్యులు మాట్లాడుతూ మందిరంలో అత్యంత వైభవంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు జరిగాయని తెలిపారు. చార్మినార్ పోలీసులుగట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# రక్షణ శాఖ జాయింట్ కార్యదర్శి రాఖేష్ మిట్టల్‌తో సమీక్ష సమావేశం



కంటోన్మెంట్ బోర్డులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాఖేష్ మిట్టల్

**కంటోన్మెంట్,డిసెంబర్ 30 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో మంగళవారం రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాఖేష్ మిట్టల్ డిఫెన్స్‌ఎస్టేట్, కంటోన్మెంట్ బోర్డు వివిధ విభాగాల అధికారులతో సమావేశమైయ్యారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ విభా శర్మ, పూణె డైరెక్టర్ ప్రసాద్ చౌహాన్, రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్‌డి అజిత్‌రెడ్డి, జాయింట్ సిఈఓ, డిఫెన్స్‌ఎస్టేట్ ఆఫీసర్, బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది, బోర్డు సూపరిండెంట్లు ఎం.దేవేందర్, ఎం.మహేందర్, సి.హెచ్.ఉమా శంకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూఇయర్ వేడుకల సందర్భంగా మెట్రో సేవలు పొడిగింపు

## -అర్ధరాత్రి 1గంట వరకు అందుబాటులో రైళ్లు

**హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త:** న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ మెట్రో రైల్ తమ ప్రయాణీకులకు గుడ్‌న్యూస్ చెప్పింది. సాధారణంగా మెట్రో రైళ్లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. కానీ, కొత్త సంవత్సర వేడుకల్ని దృష్టిలో పెట్టుకుని 31వ తేదీ రాత్రి మెట్రోరైలు వేళలను హెచ్ఎమ్ఆర్ఎల్ పొడిగించింది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. ప్రారంభ స్టేషన్‌ల నుంచి రాత్రి ఒంటిగంటకు చివరి మెట్రో రైళ్లు బయలుదేరనున్నాయి. మెట్రో రైలు ప్రయాణీకులు దీన్ని దృష్టిలో పెట్టుకుని తమ జర్నీని ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.

# మాదకద్రవ్యాల కేసులో మహిళ అరెస్ట్

## - గోవా మహిళతోపాటు మరో ముగ్గురు పరారీ

**జూబ్లీహిల్స్, డిసెంబరు 30, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల కేసులో బంజారాహిల్స్ పోలీసులు ఒక మహిళను అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి ఎండీఎంఏతోపాటు ఎల్ఎస్‌డీని స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 3లోని గ్యాలక్సీ మొబైల్ షాప్ సమీపంలో మాదకద్రవ్యాల సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఒక మహిళ అనుమానస్పదంగా కనిపించడంతో ఆమెను సోదాలు చేశారు. ఆమె వద్ద 0జ43 గ్రాముల ఎండీఎంఏ, ఒక ఎల్ఎస్‌డి బ్లాట్, సామసంగ్ సెల్‌ఫోన్, వ్యక్తిగత వస్తువులతో కూడిన ఒక నల్ల బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. ఆమెను విచారించగా హబీబ్‌నగర్‌కు చెందిన హస్నా హమీద్(47)గా గుర్తించారు. ఆమెకు గోవాకు చెందిన మాదకద్రవ్యాల సరఫరాదారు రోమీ భరత్ కళ్యాణి, వినియోగదారులైన మీనా, సుమిహా ఖాన్, ఫలక్‌నుమాకు చెందిన వజీర్ బాక్సర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మహిళపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ అర్చన జయప్రకాష్



**అత్తాపూర్ డిసెంబరు30,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి కృషి చేయాలని కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతిని మంగళవారం రాజేంద్రనగర్ కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన అధిక నిధులు కేటాయించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పేదరోగుల సహాయకులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అసద్, అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ముజీబ్

**గన్‌ఫౌండ్రి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** అసద్, అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యం కోసం పేద రోగులకు ఉచితంగా అన్నదానం చేశారు. ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 400 మంది పేదరోగులకు ట్రస్ట్ చైర్మన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల నుంచి పేద రోగులకు ప్రతినెల మూడు వారాలపాటు అన్నదానం చేయడం, ముఖ్యంగా ముజీబ్ తల్లిదండ్రుల పేరిట అన్నదానం చేయడం పట్ల సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, టిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యవర్గసభ్యులు ఖురేషీ ముకీం, ఎం.ఎన్.జె క్యాన్సర్ అధ్యక్షులు బి.శివకుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, వహీద్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : ఎంపి ఈటల



రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాఖేష్ మిట్టల్‌తో బేటీ అయినా ఎంపీ ఈటెల, బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, కారుణ్య నియామకాలను వెంటనే భర్తీ చేయాలని రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాకేష్ మిట్టల్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, బోర్డు మెంబర్ బానుక నర్మధలు మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన సర్వీస్ ఛార్జీల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, రోడ్ల, డ్రైనేజీ, నాలాల శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని ఆయన కోరారు. బోర్డు మెంబర్ బానుక నర్మధ 10 నెలల వ్యవధిలో రూ.15 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు రాఖేష్ మిట్టల్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి నేతలు బి.ఎన్. శ్రీనివాస్, బానుక మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే జరపాలి : జె.ఎం.ఆర్.



రక్షణ శాఖ కార్యదర్శి రాఖేష్ మిట్టల్‌ను కలిసి బోర్డు మాజీ వి.పి.జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు మెంబర్లు

**కంటోన్మెంట్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి పదవి కాలం ముగిసి 6 సంవత్సరాలు గడిచిన ఎన్నికలు నిర్వహించక పోవడంతో ప్రజల మౌళిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు ప్రజా స్వామ్య హక్కును కోల్పోతున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు రక్షణ శాఖ కార్యదర్శి రాఖేష్ మిట్టల్‌కు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన వెయ్యి కోట్ల పెండింగ్ సర్వీస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్లు పాండు యాదవ్, పి.శ్యామ్‌కుమార్, లోకనాథం, నళిని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు పునరుద్ధరిస్తాం -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌దాస్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబర్ 30, ప్రభాతవార్త:** స్పోర్ట్స్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు పునరుద్ధరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ఇందుకోసం జీవో 252లో అవసరమైన మార్పులు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252లో స్పోర్ట్స్, సినిమా, కల్చరర్ జర్నలిస్టులకు ప్రత్యేక కోటా లేకపోవడాన్ని స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జెఏటి) మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఈమేరకు మంగళవారం సచివాలయంలో టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్ టీ ప్రతినిధులతో కలిసి ప్రెసిడెంట్ క్రిష్ణా రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ దాస్ మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి శ్రీనివాస రెడ్డి.. స్పోర్ట్స్ జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతంలో మాదిరిగా స్పోర్ట్స్ జర్నలిస్టులకు ప్రత్యేక కోటాను కొనసాగించేలా జీవోలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్, నవీన్, డీజేఎఫ్‌టీ ప్రతినిధులు ఉపేందర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలి



డైరీని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 30 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలు మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభం అయ్యాయి. అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎం.ఎన్.రెడ్డి స్వాగతోపాన్యాసం చేశారు. అనంతరం ఎన్ సిసి పి సి ప్రధాన కార్యదర్శి కె రాఘవేంద్రన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, ప్రభుత్వం దిగి రాకపోతే యుద్ధానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. పెన్షనర్లను ప్రభుత్వం అనేక రకాలుగా విభజిస్తున్నారని, . దానికి చట్టాలు కూడా చేశారని, .పెన్షన్ కమిటేషన్ పై అధిక వొడ్డి వసూలు చేస్తున్నారని, .కాబట్టి పెన్షనర్ ల వ్యతిరేక చట్టాలను నిర్ణయాలను రద్దు చేయక పోతే ప్రభుత్వాన్నే మార్చాల్సిన వస్తుందని హెచ్చరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ మాట్లాడుతూ సర్వీసులో ఉన్నప్పుడు కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, డైలీవెజ్ మొదలైన విదాలుగా విడతీశారని, అదేవిధంగా పెన్షనర్లను ఈపీఎఫ్ పెన్షన్, స్టేట్, సెంట్రల్ కోల్మెన్స్ లకు రకరకాలుగా విభజించారని, సంఘం మన సమస్యలతో పాటు సీనియర్ సిటిజన్ల సమస్యలను కలుపుకొని పోరాటం చేయాలని, అప్పుడే ప్రభుత్వాలు దిగివస్థాయని చెప్పారు. తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, సెక్రటరీ జనరల్ లు మారం జగదీశ్వర్ , ఏలూరి శ్రీనివాస రావు హాజరై సభలు విజయవంతం కావాలని అభినందించారు. ప్రభుత్వానికి ఇచ్చిన సమయం అయిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి కాగానే మన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పై పోరాడటానికి మనం అందరం సిద్ధం కావాలని సూచించారు. పి నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జీవో 252లో కొన్ని సవరణలు చేయండి

### మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం విజ్ఞప్తి



**హైదరాబాద్ డిసెంబరు30,ప్రభాతవార్త:** జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో పై చర్చించడంతో పాటు వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన తమ సంఘం ముఖ్యుల సమావేశం, 252జీవో ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుండి వ్యక్తం అవుతున్న అభ్యంతరాలు, జీవో లో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రితో తెలిపారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్ లతో సహ ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేందుకు జీవో ను సవరించాలని కోరారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్హూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎం.డి.గౌస్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు ఉన్నారు. టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాంజీవో 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని, మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

## పాలసీదారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం విశేషం

**చిక్కడపల్లి డిసెంబర్ 30 ప్రభాతవార్త :** ప్రసిద్ధ భారతీయ ముఖ్య జీవిత బీమా సలహాదారు కౌటికే విఠల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణకర్త మానేపల్లి మురళీకృష్ణ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. కాన్సర్ ఆసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానేపల్లి మురళీకృష్ణ అతి సమీప బంధువు ప్రియా గోల్డ్ ఆయిల్ యజమాని బుక్క శ్రీనివాస్, న్యాయవాది మడిపల్లి రవి, విఠల్ సతీమణి కావ్య, కుమారుడు ఆదిత్య, ఆవోపా హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మడుపల్లి రవి గుప్తా, విఠల్ మిత్రులు ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ, విఠల్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. కౌటికే విఠల్ మాట్లాడుతూ నా విలువైన పాలసీదారులు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో 100 సంవత్సరాలు జీవించాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. అని తెలిపారు.

### ఘనంగా ముదిరాజ్ సర్పంచ్‌లకు సన్మానం



సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**నిజాంపేట్, డిసెంబర్ 30, ప్రభాతవార్త** తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ నిర్వహించిన ముదిరాజ్ సర్పంచుల సన్మాన సభ కార్యక్రమంలో జాతీయ ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటిన ముదిరాజ్ సర్పంచులు, వార్డు సభ్యులను తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ వారు సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో ముందున్న సామాజికవర్గం ముదిరాజ్ అని, అయితే నేడు స్థానిక ఎన్నికల్లో భారీ సంఖ్యలో సర్పంచ్, వార్డు స్థానాలను ముదిరాజ్ నాయకులు కైవసం చేసుకోవడం రాజకీయంగా ఒక మెట్టు ఎక్కినట్టేనని తెలిపారు. ఇది అత్యంత గొప్ప పరిణామమని అన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో, తమదైన శైలిలో అడుగులు వేస్తూ చట్టసభల్లోనూ భారీ స్థానాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజు, ఈటల రాజేందర్ అలాగే తెలంగాణ ముదిరాజ్ మహాసభకు చెందిన ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజలంతా సుఖఃశాంతులతో వర్ధిల్లాలి : బండి రమేష్



**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ: శాంతులతో వర్ధిల్లాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకన్న ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీ సంక్షేమ సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు మోయినుద్దీన్, నాయకులు కనయ్యముదిరాజ్, ఆదిరెడ్డి, రవి ముదిరాజ్, వేణు, రఘుపతిరెడ్డి, మహేందర్, కమలమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఓసి ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

### -అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి




అసోసియేషన్ డైరీ ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, భానుప్రకాశ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 30,ప్రభాతవార్త:** సంస్థలో పనిచేస్తున్న ఓసి ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఓసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం ఎర్రగడ్డలోని విద్యుత్ ఓసి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2026కు సంబంధించిన డైరీ, క్యాలెండర్, హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సంస్థలో పనిచేసే ఓసి ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఓసి అసోసియేషన్ పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్ మాట్లాడుతూ విద్యుత్ ఓసి ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల సాధనే ప్రధాన లక్ష్యంగా అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. అలాగే న్యాయబద్ధంగా రావలసిన ప్రమోషన్లను సాధించడం కొరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నామని ఆ ఫలాలను ప్రతి ఒక్క విద్యుత్ ఓసి ఉద్యోగికి అందేలా చిత్తశుద్ధితో నిరంతరం పాటుపడతామన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడుతూ సంస్థలో ఓసి ఉద్యోగుల నిరంతర శ్రమ, కృషి ఎప్పుడు ఉండాలని తద్వారా సంస్థ యొక్క పురోభివృద్ధిలో భాగస్వాములు అవుతామన్నారు. సంస్థ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాలని ప్రతి ఒక్క సభ్యుడిని అందులో భాగస్వామికావాన్నారు.

## నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా కూచిపూడి నృత్య అంశాలు ప్రదర్శించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 30 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి శ్రీ త్యాగరాయణ గానసభలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భం గా మంగళవారం రాత్రి గుండవరపు హనుమంత రావు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కూచిపూడి నాట్య గురువు జ్వాలా ముఖి శిష్య బృందం శాన్వీ వర్షిణి ,వైష్ణవి, అధ్య త్రిష, జాయనీ, ఉదయ, కూచిపూడి నృత్య అంశాలు కన్నుల పండుగగా నర్తించారు తొలి అంశం గణపతి స్తుతిస్తూ నర్తించి అనంతరం అన్నమయ్య కీర్తనలు ముద్దుగారే యశోద, ఒక పరి కోక పరి, వచ్చెను అలివేలు మంగా తదితర అంశాలు ప్రదర్శించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి గురువు జ్వాలా ముఖి తో పాటు శిష్యులను అభినందించి మాట్లాడారు గాన సభ సంప్రదాయ కళలు మరియు మరుగు పడుతున్న తెలంగాణ జానపద ప్రక్రియలు ప్రదర్శనకు వేదిక కల్పిస్తుంది అని కళా కారులు తమను సంప్రదించవచ్చు అని చెప్పారు

## 14 నుంచి రామేశ్వరంలో 'సనాతన జాగరణ-దేశకళ్యాణ యజ్ఞయాత్ర'




సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య తేజస్. చిత్రంలోధర్మతేజ, నరేంద్ర

**సైఫాబాద్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** లోక కల్యాణం కోసం మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి, స్వామి శ్రద్ధానంద సరస్వతి బలిదాన శతాబ్ది, ఆర్య సమాజ స్థాపన సార్ధ శతాబ్ది సందర్భంగా విశ్వకల్యాణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'సనాతన జాగరణ–దేశకళ్యాణ యజ్ఞ యాత్ర'ను మకర సంక్రాతి పర్వదినం జనవరి 14న ప్రారంభిస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధి ఆచార్య తేజస్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డా.ధర్మతేజ, నరేంద్రఆచార్యలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ పవిత్ర యాత్ర యజ్ఞం 14న తమిళనాడులోని రామేశ్వరం నుంచి ప్రారంభమై 16 రాష్ట్రాల మీదగా 9,600 కిలో మీటర్లకుపైగా ప్రయాణిస్తూ జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లోగల లాల్ చౌక్ వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ యాత్రలో భాగంగా ఆయా రాష్ట్రాలలో వందకు పైగా ప్రదేశాలలో 'వేదాధ్యయనం, యజ్ఞయాగాదులు, గోసేవ, గోపాలన' వంటి అంశాలపై ప్రవచనాలు కొనసాగుతాయన్నారు. యజ్ఞ రథ ప్రారంభోత్సవం సందర్భంగా ఖానాపూర్‌లో ఈ జనవరి 3వ తేదీ నుంచి అగ్ని మంథన కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా హర్యానాలోనని ఖాన్‌పూర్‌లోగల ఆర్షగురుకులం ప్రముఖులు ఆచార్య శ్రీప్రధ్యుమన్న, సమతా మూర్తి విగ్రహ ప్రతిషాపకులు శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి, హర్యానాలోని విశ్వవారా కన్యా గురుకులం ప్రముఖులు పద్మశ్రీ ఆచార్య సుకామా పాల్గొంటారని ఆయన తెలిపారు.

## వైకుంఠ ద్వారదర్శనానికి పోటెత్తిన భక్త జనసందోహం

### గోవింద నామాలతో హోరెత్తిన శ్రీవారి సన్నిధి



చిక్కడపల్లి శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ



స్వామివారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

**చిక్కడపల్లి, డిసెంబర్ 30 ( ప్రభాతవార్త ) :** ప్రభాతవార్త: ఎక్కడ చూసిన భక్త జనసందోహం..ఎటు చూసిన గోవిందభక్త జన సందోహంతో చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. మంగళవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కంచుకుని వైకుంఠ ద్వారదర్శనంతో భక్తులు పులకించిపోయారు. తెల్లవారుజామునన మూడున్నర గంటల నుంచే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో భక్తులతో హోరెత్తింది. నాలుగు గంటల ప్రాంతంలో దేవాలయం ద్వారాలు తెరుచుకోవడంతో భక్తులు భక్తి పారవశ్యంతో ఊగిపోయారు. 'ఏడుకొండలవాడా వేంకటరమణ గోవిందా....గోవిందా', 'ఆపద మొకు ¿లవాడా అనాధరక్షక గోవిందా...గోవిందా అంటూ జయజయధ్వానాలు చేయడంతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. ఈ ఉత్సవాన్ని పుంస్కరించుకుని ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరణలు చేశారు. గజగజ వణికే చలిని సైతం లెక్క చేయకుండా తెల్లవారుజామున మూడు గంటలకే అలయం వద్ద భక్తులు బారులుతీరి ఉండడం కనిపించింది. అంతకుముందు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సుప్రభాత సేవతో స్వామివారికి కైంకర్యాలు నిత్యారాధనన, పాలాభిషేకం, బంగారు పుష్పార్చనన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారంగా వైకుంఠ ద్వారదర్శనం నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్ గౌడ్, ఈ ఓ రామాంజనేయులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా చిక్కడపల్లి శ్రీవారి అలయం వద్ద ప్రారంభమైన క్యూలైన్ అర్టీసి క్రాస్‌రోడ్స్ వరకు బారులుతీరి ఉండడం విశేషం. దీంతో చిక్కడపల్లి మెయిన్ రోడ్డు వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడకుండా చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు బందోబస్తును పర్యవేక్షించారు. హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాష్ట్ర రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారదర్శనం సందర్భంగా ముందుజాగ్రత్త చర్యగా అలయం ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల భారీ భద్రతా ఏర్పాటు చేశారు.

## దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత : కూన శ్రీశైలం గౌడ్



కళ్యాణ మండపానికి ఛానల్ గేట్లను ప్రారంభిస్తున్న శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, డిసెంబర్ 30, ప్రభాతవార్త** దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధి హెచ్ ఏ ఎల్ కాలనీలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గిరి ప్రదక్షిణకు దారి, దేవాలయ గుట్ట మీదకి మెట్ల దారి, కళ్యాణ మండపానికి ఛానల్ గేట్లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం శ్రీశైలం గౌడ్ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు శ్రీశైలం గౌడ్‌ని శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఈ దేవాలయం అభివృద్ధికి నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, లక్ష్మీ నరసింహ స్వామి కృప ఎల్లప్పుడూ ప్రజలందరిపైన ఉండాలని, లక్ష్మీ నరసింహ స్వామి దయవల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేకేఎమ్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఇంద్రసేన గుప్తా, ఉపాధ్యక్షులు ఎన్ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఆర్ యాదగిరి, కోశాధికారి ఈ సురేష్, కార్యదర్శి నరసింహారెడ్డి, శంకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రవీందర్ గౌడ్, టీవీ శ్రీను, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సిహెచ్ బుచ్చి రెడ్డి, అంజి యాదవ్, గోవర్ధన్ రెడ్డి, ఐ యాం సాగర్, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, కూన రాఘవేంద్ర గౌడ్, చౌద శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, గౌడ్ శెట్టి శివ ఈశ్వరరావు, షాకీర్, వెంకట్, నర్సింగరావు, మురళి, ప్రభాకర్ రెడ్డి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆలయ సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్



ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 30 ప్రభాతవార్త :** పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల చారిత్రక ఆలయాల వద్ద గల పలు సమస్యల పరిష్కారానికై చాంద్రాయణగుట్ట డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్ మంగళవారం ఆయా ఆలయాలను సందర్శించారు. శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీ శివాలయం, శ్రీ భ్రమారాంబదేవి సమేత చెన్నమల్లికార్జున స్వామి దేవాలయాల వద్ద గల సమస్యలను మాజీ చైర్మన్ కె.నాగరాజు, ఆలయ పూజారి కోటి హరీష్ కుమార్, స్థానిక ప్రజలను అడిగి తెలుసుకు న్నారు. గుట్టపై చెన్నకేశవ ఆలయం చుట్టూ ప్రహరీ గోడ, ప్రార్థన మందిరం, మంచినీటి వ్యవస్థ, బోరింగ్ తదితర పనులను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని పనులు ఒకే ఎస్టిమేట్‌లో ఉండాల చూడాలని ఎఇ శివకు సూచించారు. అనంతరం పలు అభివృ ద్ధి పనులకు శిలాఫలకం వేశారు. ఆలయ మాజీ చైర్మన్లు మహేష్ గౌడ్, నాగరాజు, పూజారి హరీష్‌కుమార్ కార్పొరేటర్ వాహబ్‌ను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

### రూ. 5లక్షల విలువ చేసే వెండి ఆభరణాల వితరణ



**అత్తాపూర్ డిసెంబర్30,ప్రభాతవార్త :** అత్తాపూర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లోని టీఎన్జీవోస్ కాలనీలో వెంకన్న గుట్టపై గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉత్తర ద్వారం ద్వారా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆదర్శ కాలనీలోని జయదేవ్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బి సంతోష్ కు మార్ దంపతులు స్వామివారికి రూపాయలు ఐదు లక్షలు విలువచేసే రెండు కిలోల వెండి ఆభరణాలను బహుకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.


IN THE COURT OF THE HON'BLE XI ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT:L.B.NAGAR
O.S.No.636 of 2019
BETWEEN:
ADIMULAM PANDU & another ...Plaintiffs
AND
GANGANI CHINNA MAISAIAH & others ...Defendants
TO
D.10
Mr Mukesh Agarwal S/o Ratanlal Agarwal, Aged about 40 years, Occup Business R/o 10-3-3/28 East Marredpally, Secunderabad.
D.11
Mrs Komal Agarwal W/o Mukesh Agarwal, Aged about 38 years, Occup House Wife R/o 10-3-3/28 East Marredpally, Secunderabad.
D12A K Sai Charan S/o AK Murugesh Aged About 22 years, Occup Business R/o Flat No 416 Dream Enclave, Yadav Nagar Malkajgiri, Hyderabad 500 047
That the plaintiffs had filed the suit OS.NO.636 of 2019 for declaration and the suit summons sent to you in ordinary way could not be served upon you. That the Hon'ble Court ordered substituted service of summons on you through publication in news paper and posted the case on 29-01-2026 for your appearence. Hence take notice of the same and appear before the above said court on 29-01-2026 at 10:30AM and file your written statement along with relevant documents if any. That on your failure to appear the matter would be decided in your absence.
BY ORDER OF THE COURT
Sd/- Guruvula Madhusudan Shashidhar Vasavi Advocates
Plot No. 35 H.No: 8-3-315/18, Maruthinagar Srinagar Colony, Hyderabad 500045
91 40 79629203-98480 95939
Email id-guruvulas@gmail.com
TS/447/1978


## నయన మనోహరం సుమధుర ద్విదశాబ్ద ఉత్సవం

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 30, ప్రభాతవార్త :** ప్రముఖ కూచిపూడి కళాకారిణి శ్రావ్య మానస బోగిరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న సుమధుర ఆర్ట్స్ అకాడమీ ద్విదశాబ్ది ఉత్సవం నయన మనోహరంగా సాగింది. దాదాపు 350 మంది విద్యార్థులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా చక్కటి అభినయంతో చేసిన ప్రదర్శనలు కళాప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాజీ గౌవర్నర్ బండారు దత్తాత్రేయ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు మామిడి హరికృష్ణ హాజరయ్యి కళాకారులను అభినందించారు. ప్రముఖ సినీ దర్శకులు రామ్ జగదీష్‌తో పాటు పలు ప్రముఖులు పాల్గొని శ్రావ్యామానసకు అభినందనలు తెలిపారు.


వార్త CLASSIFIEDS వార్త

LOST
★ I Swarna Vaitla, D/O VVV SATYA-NARAYANA, residing at Lanco hills have 2 minor children. Their USA passports have been lost near Khajaguda junction on Jan 8 2025 in Auto while coming from office. Passport details Nivin Nannapaneni-642833442. Yuvin Nannapaneni- A11410768. If found please call - 9885114444.
(Ro.No.068752)

Situation Vacant
★ Reqd. an Experienced Sales Manager for IT Distribution Industry in Hyderabad Walk in for interview from 30th Dec at Zorins Technologies Attapur Call, +91 8977747873 Email: malik@zorin-stechnologies.com
(Ro.No.36650)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

